మండలకాలం.. మహా ప్రసాదం



- శీలానగర్ అయ్యప్పస్వామి ఆలయంలో ఉచితంగా భిక్ష
- 23 ఏళ్లుగా కొనసాగింపు
- రోజుకు సుమారు 3 వేల మంది స్వాములు, భక్తులకు అన్నప్రసాదాలు



శీలానగర్‌లోని అయ్యప్ప ఆలయం



ఆలయంలో అన్నప్రసాదాలు స్వీకరిస్తున్న స్వాములు (ఇన్‌సెట్) స్వామి అయ్యప్ప నిజరూపదర్శనం

అక్కిరెడ్డిపాలెం: శీలానగర్‌లోని స్వామి అయ్యప్ప దేవాలయంలో శ్రీ స్వామి అయ్యప్ప సేవా సంఘం అయ్యప్ప మాలధారణ భక్తులకు మండలకాలంలో మహా ప్రసాదం అందిస్తోంది. ఏటా కార్తీక మాసంలోని మండలకాలంలో రోజుకు సుమారు 2500 నుంచి 3000 మంది మాలధారణ భక్తులతో పాటు కార్తీక పూజలు నిర్వహిస్తున్న భక్తులకు నిత్య అన్న సమారాధన చేపడుతోంది.

ఆ రెండు రోజులు మినహా..

స్వామి అయ్యప్ప దేవాలయం ప్రతిష్ట నుంచి ప్రతి బుధవారం అన్న సమారాధనను శ్రీ మణికంఠ జ్యోతి భిక్ష సేవా సంఘం నిర్వహిస్తోంది. ఇటీవల శ్రీ స్వామి అయ్యప్ప దేవాలయ సమితి శనివారం అన్న సమారాధన చేయడంతో ఆ రెండు రోజులు మినహా మిగిలిన అన్ని రోజులు స్వామి అయ్యప్ప సేవా సమితి నిత్య అన్నసమారాధన నిర్వహిస్తుంది.

పరమ పవిత్రం

అయ్యప్ప స్వామి మాలధారణ భక్తులు భిక్షను పరమ పవిత్రంగా స్వీకరిస్తారు. అక్కిరెడ్డిపాలెం, మింది, రాంగనగర్, నాతయ్యపాలెం, శీలానగర్, వేంకటేశ్వరకాలనీ, హరిజనజగ్గయ్యపాలెం, గాజువాక, కూర్మన్నపాలెం, అగనంపూడి, స్టీల్‌ప్లాంట్, ఎన్ఏడీతో పాటు నగరం నుంచి మాలధారణ భక్తులు ఆలయానికి నిత్యం విచ్చేస్తుంటారు. 23 ఏళ్లుగా కార్తీకమాసం మండలకాలంలో స్వాములకు నిత్య అన్నసమారాధన చేస్తున్నారు. దాతలు సహాయ సహకారాలతో కార్యక్రమాన్ని నిర్విరామంగా కొనసాగిస్తున్నారు. కార్యక్రమాలకు సీహెచ్.మురళీశ్వరరావు, ఎస్.ఎ.నాయుడు, నాగోలు రవికుమార్, పాలమరశెట్టి బూలిరాజులు ఎంతో తోడ్పాటు అందజేస్తున్నారు.

వేసవిలో చలివేంద్రం

అన్నసమారాధనతో పాటు వేసవికాలంలో 3 నెలల పాటు నిత్య మజ్జిగ పంపిణీ చేపడుతున్నారు.

23 ఏళ్లుగా అన్నప్రసాదాలు



శీలానగర్‌లోని స్వామి అయ్యప్ప దేవాలయంలో స్వామి అయ్యప్ప సేవా సంఘం ఆధ్వర్యంలో మండలకాలంలో సుమారు 50 నుంచి 60 రోజుల పాటు భిక్ష ఏర్పాటు చేస్తున్నాం. 23 సంవత్సరాలుగా అయ్యప్ప మాలధారణ భక్తులకు అన్నప్రసాదాలు అందిస్తున్నాం. నిత్య అన్నసమారాధనకు దాతలు సహకారం అందిస్తున్నారు.

– అదపాక వెంకటరమణ, గురుస్వామి, సేవా సంఘం అధ్యక్షుడు, శీలానగర్

మహా ప్రసాదం



మండకాలంలో నిత్య అన్న సమారాధన బాగా నిర్వహిస్తున్నారు. 14 సంవత్సరాలుగా అయ్యప్ప మాల వేస్తున్నాను. ఆలయంలో జరిగే నిత్య అన్నసమారాధన నిర్విఘ్నంగా సాగడంతో సేవా సంఘంతో పాటు దాతలు తమ దాతృత్వాన్ని చాటుకుంటున్నారు. అన్నసమారాధలో నిత్యం పాల్గొని అన్నప్రసాదాలు స్వీకరిస్తున్నాను.

– సీహెచ్.మురళీశ్వరరావు, భక్తుడు, భెల్

దాతల సహకారం మరువలేనిది



16 సార్లు అయ్యప్ప మాల వేసుకున్నాను. కార్తీక మండలకాలంలో నిర్వహిస్తున్న నిత్య అన్నసమారాధనను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నాం. సహకరిస్తున్న దాతలకు సత్కరించుకొని వారి సేవలను స్వీకరిస్తున్నాం. నగరం నలుమూలల నుంచి మాలధారణ భక్తులతో పాటు కార్తీకమాసం పూజలు నిర్వహిస్తున్న సాధారణ భక్తులు కూడా అన్నప్రసాదాలు స్వీకరిస్తున్నారు.

– నాగోలు రవికుమార్, సేవా సంఘం సభ్యుడు, జగ్గయ్యపాలెం.

ప్లాస్టిక్ సంచులు విక్రయిస్తే చర్యలు

- జనవరి1 నుంచి ప్లాస్టిక్ విక్రయాలు, వినియోగం నిషేధం
- గాజువాక జెడ్సీ శేషాద్రి వెల్లడి



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్సీ శేషాద్రి

గాజువాక: వచ్చే ఏడాది జనవరి 1 నుంచి ప్లాస్టిక్ సంచులు విక్రయించినా, ఉపయోగించినా భారీ మొత్తంలో జరిమానాలు విధిస్తామని గాజువాక జోనల్ కమిషనర్ శేషాద్రి తెలిపారు. మార్పురాకపోతే జరిమానాలతో పాటు కేసులు కూడా నమోదు చేస్తామని హెచ్చరించారు. తోపుడు బళ్లు, చిరు వ్యాపారులతో గాజువాక జోనల్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల ఎదురయ్యే సమస్యలను వివరించారు. ప్లాస్టిక్ నిషేధం పూర్తిస్థాయిలో అమలయ్యేందుకు వ్యాపారులు, ప్రజలు సహకరించాలని కోరారు. ప్లాస్టిక్ సంచుల వినియోగం నిషేధంపై వచ్చేనెల 31వ తేదీ వరకు అవగాహన కార్యక్రమాలు చేపడతామన్నారు. ప్లాస్టిక్ విక్రయించే హోల్‌సేల్ దుకాణాలతోపాటు దుకాణాలకు వెళ్లి సరఫరా చేస్తున్న వ్యాపారులపై కూడా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. గుడ్డ సంచులను తెచ్చుకోవాలని వినియోగదారులకు వ్యాపారులు చెప్పాలని సూచించారు. ప్లాస్టిక్ సంచుల్లో సరుకులు ఇవ్వవద్దన్నారు. ఆహార పదార్థాలు, అల్పాహార దుకాణాల్లో కూడా పార్శిళ్ల కోసం ప్లాస్టిక్ కవర్లను ఉపయోగించడానికి వీల్లేదన్నారు. సమావేశంలో జీవీఎంసీ ప్రజారోగ్య విభాగం సహాయ వైద్యాధికారి డాక్టర్ ఎస్.కిరణ్ కుమార్, శానిటరీ సూపర్‌వైజర్ బి.వి.రామారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, శానిటరీ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

అపార్ నమోదు తప్పనిసరి

ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలకు డీఈవో ప్రేమ్‌కుమార్ ఆదేశం



మాట్లాడుతున్న డీఈవో ప్రేమ్ కుమార్

గాజువాక: ప్రైవేట్ పాఠశాల్లో చదువుతున్న విద్యార్థుల వివరాలను ఆటోమేటెడ్ పర్మినెంట్ అకాడమీ అకౌంట్ రిజిస్ట్రీ (అపార్)లో నమోదు చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.ప్రేమ్ కుమార్ ఆదేశించారు. గాజువాక, పెదగంట్యాడ, ములగాడ మండలాల పరిధిలోని ప్రైవేట్ పాఠశాలల నిర్వాహకులతో ఆయన బుధవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాల్లో చదువుతున్న విద్యార్థుల భవిష్యత్‌కు అపార్‌లో నమోదు ఎంతో అవసరమన్నారు. పాఠశాలల లాగిన్‌లో వెంటనే నమోదు చేయాలన్నారు. ఏ స్కూల్ లాగిన్‌లో ఒక్క విద్యార్థికి సంబంధించిన వివరాలు కూడా పెండింగ్‌లో ఉండటానికి వీల్లేదన్నారు. ఫార్మేటివ్ 1, 2 పరీక్షల మార్కులను కూడా వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. పాఠశాలల్లో చదవని విద్యార్థుల వివరాలు లాగిన్‌లలో ఉండరాదన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉప విద్యాశాఖాధికారి రవీంద్రబాబు, మండల విద్యాశాఖాధికారులు విశ్వనాథం, సునీత, శ్రీనివాస్, రమణాజీ, వెంకటరావు, త్రినాథరావు, గాజువాక ప్రాంత ప్రైవేట్ పాఠశాలల సంఘం (జిప్సా) ప్రతినిధులు పి.భాస్కరరావు, బి.శ్రీనివాసరావు, షణ్ముఖరావు, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో క్షీరాబ్దిద్వాదశి పూజలు



79వ వార్డు అగనంపూడి ఉమామహేశ్వర స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



87వ వార్డు కూర్మన్నపాలెంలో అర్థ ఏకాహం



బాలచెరువు ఉమారామలింగేశ్వర ఆలయంలో దీప దానం చేస్తున్న భక్తులు

అగనంపూడి: క్షీరాబ్ది ద్వాదశి సందర్భంగా 79వ వార్డు అగనంపూడి జూబిలీ హిల్స్ గేటెడ్ కమ్యూనిటీ ఆవరణలోని ఉమామహేశ్వరస్వామి ఆలయంలో బుధవారం ఘనంగా పూజలు నిర్వహించారు. శ్రీకృష్ణుడికి మహిళలు విశేష పూజలు చేశారు. దీపాలంకరణలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు ఆంజనేయులు, అచ్యుతరావు, నాయుడు, శంకరరావు, మణి, కృష్ణారావు, మహిళా నాయకులు గొల్లవిల్లి కనక భవాని, శ్రీను, వెంకటరావు పాల్గొన్నారు. జీవీఎంసీ 87వ వార్డు కూర్మన్నపాలెం మస్తాఫా కూడలి సమీపంలోని గౌరీ పరమేశ్వరుల ఆలయ ఆవరణలో అర్థ ఏకాహం భక్తిశ్రద్ధలతో జరిపించారు. ఓం నమఃశివాయ నామస్మరణతో ఆలయ ఆవరణ మార్మోగింది. అలాగే గురువారం ఉదయం గాజుల పండగ నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

పెదగంట్యాడ: మండంలోని శివాలయాల్లో బుధవారం క్షీరాబ్ది ద్వాదశి పూజలు ఘనంగా నిర్వహించారు. ఇళ్ల వద్ద తులసి కోటకు పందిరి ఏర్పాటు చేసి ఉసిరి కొమ్మను తీసుకువచ్చి పూజలు చేశారు.అనంతరం ఆలయాలకు వెళ్లి భక్తులు దీప దానాలు చేశారు.

క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

పెదగంట్యాడ: పెదగంట్యాడ 11 కేవీ ఫీడర్‌లో మరమ్మతులు చేపట్టనున్న దృష్ట్యా శుక్రవారం పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఈపీడీసీఎల్ జోన్-2 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బీకే నాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫీడర్ పరిధిలోని గొడ్డువానిపాలెం, దుర్గవానిపాలెం, నెల్లిముక్కు, సీతానగరం, పెదగంట్యాడ మెయిన్ రోడ్డు, బర్మా కాలనీ, బాబూ జగ్జీవన్‌రామ్ నగర్ ఏరియా, రైతు బజార్ తదితర ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

సాయి ఆలయంలో ఏకాహం నేడు

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు అగనంపూడి షిర్డీసాయి మందిరంలో గురువారం ఉదయం 6 గంటల నుంచి శుక్రవారం ఉదయం వరకు ఏకాహం జరిపించేందుకు ఆలయ కమిటీ ఏర్పాట్లు చేసింది. ఓం సాయి.. శ్రీ సాయి.. జయ జయ సాయి నామస్మరణలో భక్తులు పాల్గొవాలని ఆలయ కమిటీ ప్రతినిధులు కె.వి.రమణారెడ్డి, డి.వ్యాసశర్మ కోరారు.

ఆర్టీసీ ఆధ్వర్యంలో పంచారామ క్షేత్ర దర్శిని

ఉక్కునగరం: కార్తీక మాసం సందర్భంగా ఆర్టీసీ ఆధ్వర్యంలో పంచారామ క్షేత్ర దర్శిని టూర్ ఏర్పాటు చేసినట్టు స్టీల్‌సిటీ డిపో మేనేజర్ తెలిపారు. కార్తీకమాసంలోని ప్రతీ ఆదివారం సాయంత్రం 5 గంటలకు గాజువాక డిపో నుంచి బస్సులు బయల్దేరనున్నాయి. సోమవారం అమరావతి, భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారామం, సామర్లకోట పంచారామ క్షేత్రాలు దర్శనాలు చేయిస్తారు. మనిషి ఒకరికి బస్సు చార్జీలు అల్ట్రా డీలక్స్ రూ. 2100, ఎక్స్‌ప్రెస్ రూ. 1900, మెట్రో ఎక్స్‌ప్రెస్ రూ. 1700గా నిర్ణయించారు. ఆసక్తి కలిగిన వారు 73829 21540, 96765 11614, 9441466574 నంబర్లలో సంప్రదించాలని డిపో మేనేజర్ కోరారు.

ఘనంగా అభయాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం



పూజల్లో పాల్గొన్న మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ తదితరులు

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు లంకెలపాలెం జాతీయ రహదారి ఫార్మాసిటీ కూడలిలోని అభయాంజనేయస్వామి ఆలయ 11వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ పాల్గొని స్వామి వారికి విశేష పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అభయాంజనేయస్వామి మహిమ, దేవుని చల్లని చూపుల వల్ల ఆలయం ఏర్పాటు చేసినప్పటి నుంచి ఈ ప్రాంతంలో రోడ్డు ప్రమాదాలు పూర్తిగా తగ్గాయన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీఈసీ సభ్యుడు పైలా శ్రీనివాసరావు, పరవాడ జెడ్పీటీసీ పైలా సన్యాసిరాజు, (పీఎస్‌రాజు), వైఎస్ ఎంపీపీ బంధం నాగేశ్వరరావు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్కా రామునాయుడు, ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆహార నియమాలతో మధుమేహం నియంత్రణ

అక్కిరెడ్డిపాలెం: నిత్యం ఆహార నియమాలు పాటించడం ద్వారా మధుమేహాన్ని నియంత్రించవచ్చునని శీలానగర్‌లోని కిమ్స్ ఐకాన్ ఆస్పత్రి కన్సల్టెంట్ ఎండో క్రైనాలజిస్ట్ డాక్టర్ శ్రావణి అన్నారు. గురువారం అంతర్జాతీయ మధుమేహ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆస్పత్రిలో మధుమేహం ఎలా వస్తుంది.. నివారణ అనే అంశంపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. డయాబెటిస్ వ్యాధి చికిత్సలో కీలకమైన ఇన్సులిన్‌ను కనుగొన్న వారిలో ఒకరైన ఫ్రెడరిక్ బాంటింగ్ పుట్టిన రోజు నవంబర్ 14న ఏటా ప్రపంచ మధుమేహ వ్యాధి దినోత్సవాన్ని జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా సుమారు 53.7 కోట్ల మంది ప్రజలు డయాబెటిస్ మెల్లిటస్ (మధుమేహం)తో బాధపడుతున్నారన్నారు. దీనికి కారణం వ్యాధి లక్షణాలపై అవగాహన లేకపోవడమే అన్నారు. తరచూ మధుమేహం పరీక్షలు నిర్వహించుకోవాలని సూచించారు.

పారిశుధ్య సిబ్బందికి నూతన వస్త్రాల అందజేత



నూతన వస్త్రాలు అందజేస్తున్న కార్పొరేటర్ గుడివాడ అనూష, లతీష్ దంపతులు

అక్కిరెడ్డిపాలెం: ఇటీవల విజయవాడలో సంభవించిన వరదలకు ప్రభావితమైన ప్రాంతాల్లో సేవలు అందించిన పారిశుధ్య సిబ్బందికి బుధవారం వార్డు కార్పొరేటర్ గుడివాడ అనూష, గుడివాడ లతీష్ దంపతులు నూతన వస్త్రాలు అందజేశారు. మిందిలో జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ పారిశుధ్య సిబ్బంది సేవలు ఎనలేనివి అని కొనియాడారు. కార్యక్రమంలో వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

అగనంపూడిలో...

అగనంపూడి: జీవీఎంసీ 88వ వార్డులోని పారిశుధ్య కార్మికులకు జీవీఎంసీ నిధులతో సమకూర్చిన దుస్తులను వార్డు కార్పొరేటర్ మొల్లి ముత్యాలు బుధవారం అందించారు. విజయవాడలో బుడమేరు వరద ప్రభావిత ప్రాంతాల్లో సేవలు అందించిన కార్మికులు వీటిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ అనిల్, జీవీఎంసీ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి గొలగాని అప్పారావు, అరుణ, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

నిలిచిపోయిన టెండర్లను పునఃప్రారంభించాలి



ధర్నాలో మాట్లాడుతున్న నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో నిలిచిపోయిన టెండర్లను వెంటనే పునఃప్రారంభించాలని ఉక్కు కాంట్రాక్ట్ కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఉక్కు హిల్‌టాప్ కూడలి వద్ద బుధవారం అఖిలపక్ష కాంట్రాక్ట్ సంఘాల ఆధ్వర్యంలో ధర్నా చేశారు. నాయకులు మాట్లాడుతూ క్యూఏటీడీ, ఎస్‌టీఈడీ, సీఎంఎస్ విభాగాల్లో టెండర్లు సకాలంలో పూర్తి కాకపోవడంతో సుమారు 600 మంది కార్మికులు ఉపాధి కోల్పోయి రోడ్డున పడ్డారన్నారు. ఉక్కు యాజమాన్యం కావాలనే టెండర్ల ప్రక్రియను జాప్యం చేస్తుందని ఆరోపించారు. టెండర్ల విధానంలో మార్పులు చేసి ఒకే సంస్థకు ఏడు జోన్లు ఇవ్వకుండా ఒక్క జోన్ మాత్రమే ఇవ్వాలన్నారు. యాజమాన్యం వైఖరిలో మార్పు లేకపోతే ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో జి. శ్రీనివాసరావు, నమ్మి రమణ, మసేను, సూర్యకుమార్, నందికి తాతారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రేరణతో ఉన్నత శిఖరాలకు..



జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ ఆదిశేషును సత్కరిస్తున్న అధ్యాపకులు

అగనంపూడి: విద్యార్థి ఉన్నత లక్ష్యాలు ఏర్పరుకోవడంలో అధ్యాపకులు, మిత్రులు, సహచరుల ప్రేరణ అవసరమని జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ ఆదిశేషు అన్నారు. దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలలో ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ (వ్యవస్థాపకత)పై బుధవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు ఔత్సాహికులుగా మారాలంటే ముందుగా ప్రేరణ అవసరమన్నారు. ఔత్సాహికులు, స్టార్టప్‌లు చిన్న, మధ్యతరగతి వ్యాపారుల కోసం ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలు, కార్యక్రమాలను వివరించారు. కళాశాల రెక్టార్ వి.మధుసూదనరావు, ప్రిన్సిపాల్ జె.సుధాకర్ మాట్లాడుతూ విద్యార్థులు ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ శ్రీను, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికుల జీవితాలతో ఆటలొద్దు



ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న వంశీకృష్ణ యాదవ్

పెదగంట్యాడ: స్టీల్‌ప్లాంట్‌లోని వివిధ డిపార్టుమెంట్లలో మూడు నెలలుగా టెండర్లు పిలవకపోవడంతో సుమారు 600 మంది కాంట్రాక్ట్ కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని ఐఎన్‌టీయూసీ నాయకుడు కె.వంశీకృష్ణ యాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు. స్టీల్ అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఉక్కు బీసీ గేటు వద్ద బుధవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే కాంట్రాక్ట్ కార్మికులకు సక్రమంగా జీతాలు ఇవ్వడం లేదని ఆరోపించారు. కొత్తగా టెండర్లు పిలవకపోవడంతో వారంతా పని లేక పస్తులుండే పరిస్థితులు నెలకొని ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే టెండర్లు పిలిచి కార్మికులకు ఉపాధి కల్పించాలని కోరారు. అలాగే స్టీల్‌ప్లాంట్‌ను పూర్తి సామర్థ్యంతో నడపాలని కోరారు. కార్యక్రమంలో నమ్మి రమణ, నందికి తాతారావు, రమణమూర్తి, రామిరెడ్డి, ఉరుకూటి అప్పారావు, మంత్రి గోపి, పిట్టా రెడ్డి, తిప్పల గురునాథ్, శశిభూషణ్, రమణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు మోజెష్



మోజెష్‌ను సత్కరిస్తున్న నిర్వాహకులు

అగనంపూడి: వచ్చే నెల ముంబయిలో నిర్వహించనున్న జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు జీవీఎంసీ 87వ వార్డు కణితి రజకవీధికి చెందిన కింతాడ మోజెష్ ఎంపికయ్యాడు. ఈ నెల 10 నుంచి 13వ తేదీ వరకు రాష్ట్ర బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఒంగోలులో నిర్వహించిన రాష్ట్ర స్థాయి అండర్-11 పోటీల్లో మోజెష్ సత్తా చాటి విజేతగా నిలిచాడు. మోజెష్ లక్ష్య బ్యాడ్మింటన్ అకాడమీలో మురళీకృష్ణ వద్ద శిక్షణ తీసుకుని ఆటలో ప్రావీణ్యం సాధించాడు. అతని తండ్రి రాజేష్ స్టీల్‌ప్లాంట్‌లో కాంట్రాక్ట్ కార్మికుడిగా పనిచేస్తుండగా, తల్లి పావని గృహిణి. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ 87వ వార్డు ఇన్‌చార్జి కోమటి శ్రీనివాసరావు, నాయకులు వాండ్రాసి సన్యాసిరావు, వెంకటరావు, పారిపల్లి మోజెష్‌ను అభినందించారు.